# మాతృదేవత

పి. గణపతి శాస్త్రి

**అతడు ఒక్కమారు చేతు లెత్తి నదికి నమస్కరించి, తన దగ్గర ఉన్న పైడి దీనారాల పాత్రలు మూడూ ప్రవాహ మధ్యంలో ఉన్న పణుగురాళ్ళ క్రిందికి విసిరివేశాడు. ఇంకా కొన్ని బంగారు దీనారాలు ఆ గండశిలలకు అన్ని వైపుల విర జిమ్మాడు. ఇలా చేస్తే వరద ముంపులు తగ్గిపోతాయా? కరువు కాటకాలు తొలగి పోతాయా?**

"ఈ వరద ముంపులన్నీ తగ్గిపోతాయి! నమ్మండి! నా మాట నిజమయి తీరుతుంది! ఇక కరువు కాటకా లన్నీ పూర్తిగా తొలగిపోతాయి! ముమ్మాటికి ఇది నిజం!"

అదే భవిష్యద్వాణితో మాటిమాటికి గొంతెత్తి హెచ్చరిస్తూ, శ్రీనగర రాజ వీధిలో నడి నెమ్మది నెమ్మదిగా సాగి పోతున్నాడు సుయ్యుడు. కాని అతని హెచ్చరిక లెవ్వరు అంతగా పట్టించు కోవడం లేదు. వినీ విననట్టు తమ దారిని తాము నడిచి పోతున్నారు. కాని మరి కొందరు అతడు పట్టి పిచ్చివాడని వెటకారపు నవ్వులు వెలువరిస్తున్నారు.

అయితే అంతమాత్రంచేత తన ధోరణి విరమించలేదు సుయ్యుడు. మరింతగా గొంతెత్తి హెచ్చరిస్తున్నాడు. ఆపైన ఒక రావిచెట్టు చుట్టూరా కట్టిన తిన్నెమీదకెక్కి, ముమ్ముందు కాశ్మీరంలో జరగబోయే ఆ అద్భుత సంఘటన ఉట్టంకిస్తూ తిరిగి తిరిగి అదేవిధంగా హెచ్చరిస్తున్నాడు.

"ఎలాగ తగ్గిపోతాయయ్యా, ఈ వరద ముంపులు? అవి తగ్గితే గదా కరువు కాటకాలన్నీ తొలగిపోయేది? నీకేమయినా జోస్యం తెలుసునా? లేక మతి గాని పోయిందా?"

మధ్య మధ్య తన పొడిదగ్గు నిలవరించుకొంటూ, చుట్టూరా చేరిన జన సమూహంలోనించి ఒక ముసలి తాత ప్రశ్నించాడు. ఎక్కడ చెక్కు చెదర కుండా మరింత బింకంగా సమాధానం చెప్పాడు సుయ్యుడు.

"నేను జోస్యం చెప్పడం లేదు. తప్ప కుండా ఈ కరువు కాటకాలన్నీ పూర్తిగా తొలగిపోతాయి. కో కొల్లలుగా పంటలు పండి తీరతాయి! దీనికి నా దగ్గిర ఒక గొప్ప ఉపాయం ఉంది! అది నా కిటీవలే స్ఫురించింది."

"అయితే ఆ ఉపాయమేదో నువ్వే ఆచరణలో పెట్టి చూపించ రాదూ? మధ్య మాతో చెప్పడ మెందుకు? అనవ సరంగా ఎందుకింత కంఠశోష?"

జనంలోనించి ఒక కొత్త గొంతు దురుసుగా ప్రశ్నించింది. మరికొందరు అదే ప్రశ్న వంతపాడారు.

"దానికి విరివిగా సొమ్ము కావాలి! తగినంత సాధన సంపత్తి కావాలి!"

తిరిగి ఇంకా బింకంగా సమాధానం చెప్పాడు సుయ్యుడు.

"సరిపోయింది! ఎలాగో అలాగ సొమ్ము గుంజుకోడానికే నన్న మాట ఈ పన్నుగడలన్నీని!"

ఎవరో ఒక పెద్దమనిషి వెటకారంగా వెక్కిరించి, ఒక విషపు నవ్వు నవ్వి, చల్లగా అక్కడినుంచి జారుకున్నాడు. ఇంకా కొందరు అతడెవరో పట్టి వెర్రి బాగుల వాడయి ఉంటాడని చప్పరించి వేశారు. కాని సుయ్యు డటువంటి పట్టి వెర్రిబాగుల వాడు కాడు. విశాలమయిన నుదురు, వెడద కనుదోయి గమనించిన వారి కెవ్వరికయినా అతడెవరో నివురు కప్పిన నిప్పు వంటి వాడని స్ఫురించి తీరుతుంది!

సుయ్యుని పుట్టు పూర్వోత్తరాలేవో ఎవ్వరికి తెలియవు. పురిటి గుడ్డుగా ఉన్నప్పటినుంచి, శ్రీనగరంలో ఎక్కడో మారుమూల వీధిలో చెట్టుకింద దొరికిన పసివాణ్ణి తెచ్చి పెంచుకుంటున్నానని అతని తల్లి క్షేత్రపాలిక ఆ కాలంలో ఇరుగు పొరుగులతో చెప్పింది. ఆమెకు కూడా ఎటువైపు నా అన్న వారులేరు. పెనిమిటికాని, పిల్లలు కాని లేని ఆ వృద్ధురాలు ఒక వ్యవసాయదారుని పొలంలో పని చేస్తూ, అన్నవస్త్రాల కే లోటు లేకుండా సుఖంగా కాలక్షేపం చేస్తున్నది.

సుయ్యుడు క్రమ క్రమంగా పెరిగి పెద్దవాడయి, తోటి సహాధ్యాయు లందరి లోను మంచి మేధావి అనిపించుకున్నాడు. పదహారేళ్ల ప్రాయంలోనే ఒక సంపన్న గృహస్థుని ఇంట పసిపిల్లలకుపాధ్యాయుడుగా కుదురు కున్నాడు. ఆపైన ఆయా నదులపై ఆనకట్టల నిర్మాణంలోను, కాలవల తవ్వింపులలోను, దేవాలయ నిర్మాణాల లోను, వేర్వేరు కట్టడాల శిల్ప విద్యల లోను అతనికి విపరీతమయిన ఆసక్తి, అభినివేశనము కలిగాయి. అందు వల్ల వేర్వేరు శిల్పాచార్యుల వద్ద శుశ్రూష చేసి, ఆయా నిర్మాణాల రహస్యాలన్ని ఆమూలాగ్రంగా ఆకళించుకున్నాడు.

ఆ మరునాడు కూడా సుయ్యుడ దే విధంగా ఎలుగెత్తి హెచ్చరించాడు. కాని అతని గోడెవ్వరు పట్టించుకోలేదు. అయినా అతడు తన పట్టుదల విడిచి పెట్టలేదు. ప్రతి దినము ఉదయమే లేచి, రాజ వీధిలో ప్రవేశించి, అదే విధంగా గొంతెత్తి హెచ్చరించాడు!

క్రమక్రమంగా అతని వృత్తాంతం శ్రీనగరంలో నలువైపులా వ్యాపించింది. అటు పిమ్మట అది గూఢచారుల ద్వారా, ఆ కాలంలో — అంటే క్రైస్తవ శకం తొమ్మిదవ శతాబ్దంలో — కాశ్మీరం పరిపాలిస్తున్న అవంతి వర్మ చెవిని పడింది. చాలాకాలం నించి ఆదేశంలో వరద ముంపుల వల్ల పంట అంతగా పండడం లేదు. అప్పుడప్పుడు కరువు కాటకా లెదురు పడుతున్నాయి. అందు చేత సుయ్యుని సంగతి వినగానే అవంతి వర్మ హృదయంలో తీవ్రమయిన జిజ్ఞాస తహతహ చెలరేగాయి. అతనిని తన సమక్షానికి పిలిపించి, దేశంలో వరద ముంపు లెలాగ తొలగి పోగలవని ప్రశ్నించాడు. కాని సుయ్యుడు తన ఆలోచన బయట పెట్ట లేదు. పదేసి బంగారు దీనారాలు నిండించిన రాగి పాత్రలు నూరు, ఇంకా పది వేల బంగారు దీనారాలు తనకిప్పిస్తే వరదల ఉపద్రవం తప్పక తప్పించగలనని గట్టిగా మాట ఇచ్చాడు. ఆపైన దేశంలో విరివిగా పంటలు పండించ గలనని వాగ్దానం చేశాడు. ఆ సొమ్ములో తన కొక్క చిల్లి గవ్వ కూడా అక్కర లేదన్నాడు. తన మాట మీద నమ్మిక కలగకపోతే గూఢ చారులతోబాటు, రాజాధికారుల నెందరి నైనా వెంట పంపించ వచ్చునని చెప్పి, అనేక విధాల ప్రోత్సహించాడు. అంతేగాని తన ఉపాయం మాత్రం బయట పెట్టలేదు.

ఆ రాగి పాత్రలకు, అతని వాగ్దానాలకు గల సంబంధ మేమో అవంతి వర్మ కవగాహన కాలేదు. అయినా అడిగి నన్ని రాగి పాత్రలు, పైడి దీనారాలు అతని కందించ వలసిందని కోశాధికారుల కాదేశించాడు. కాని సుయ్యుని ప్రతిచర్య మిక్కిలి జాగరూకతతో గమనించి, వెనువెంటనే తన కెరిగించ వలసిందని రాజాధికారులతోబాటు గూఢ చారుల కాజ్ఞాపించాడు.

వితస్తా నది కాశ్మీరంలో మహాపద్మ సరోవరం నుండి ప్రాదుర్భవిస్తున్నది దాని కిరువైపుల అక్కడక్కడ బారులు తీర్చిన కొన్ని కొండల నుండి జారిపడిన పెద్ద పెద్ద పణుగు రాళ్ల వల్ల ఆ వాహిని ప్రవాహాని కెన్నో అవరోధా లేర్పడ్డాయి. అందువల్లనే ఆ దేశంలో మాటి మాటికి పెద్ద పెద్ద వరదల ముంపులు విజృంభించాయి. అలాగ పెనుగండ శిల లెక్కువగా అడ్డుపడిన నందక గ్రామంలో మొట్టమొదటగా అడుగు పెట్టాడు సుయ్యుడు. అతని వల్ల వింత లేమేమి జరగ గలవో అన్న ఆత్రతతో ఆ పల్లె ప్రజలందరు అతని చుట్టు గుమి గూడారు. సుయ్యు డంతట వితస్తానది



పసితనం

కొక్కమారు చేతులెత్తి నమస్కరించి, తన దగ్గిర ఉన్న పైడి దీనారాల పాత్రలు మూడు ప్రవాహ మధ్యంలో ఉన్న పణుగు రాళ్ల కిందికి విసిరి వేశాడు. ఇంకా కొన్ని బంగారు దీనారాలుకూడా ఆ గండ శిలల కన్ని వైపుల విరజిమ్మాడు! అలాగే ఇంకా మరి కొన్ని పల్లెల్లో ప్రవేశించి, ఆయా తావుల్లో వితస్తా ప్రవాహాని కడ్డుపడుతున్న పెద్ద పెద్ద రాళ్ల కిందికి బంగారు దీనారాలు గుప్పిళ్లతో విసిరి వేశాడు!

ఆయా పల్లెల్లో అర్థాకళ్లతో నక నక లాడుతున్న ప్రజ లనేకులు వెను వెంటనే ఆ నదీ ప్రవాహం మధ్యభాగాల లోనికి దూకి, అడ్డంకులుగా నిలిచిన పణుగు రాళ్ల నన్నింటినీ తీరాలవైపుకి దొర్లించారు. నీళ్లలో లోపలికి మునిగి, బంగారు దీనారాలే కాక, అవి నిండించిన పాత్ర లెన్నో చే జిక్కించు కున్నారు. ఆ విధంగా క్రమక్రమంగా అవరోధాలన్నీ తొలగిపోయిన వితస్తా వరదల బెడదలేవి లేకుండా నిండుగా, ప్రశాంతంగా ప్రవహిస్తూ, జనానీకానికి ఒక పరమానంద వాహినిలా గోచరించింది! అవంతి వర్మ కప్పటికి సుయ్యుని ఆలోచన పూర్తిగా అవగత మయింది. ఆ నృపతి అప్పటి నుండి ఆయా ఆనకట్టల నిర్మాణం కోసమని ఆత డెంత సొమ్మడిగినా మరి కాదనలేదు. పైగా అతనికి పదివేల దీనారాలు బహూకరించాడు.

అప్పటినుండి కాశ్మీరంలో సుయ్యుని కీర్తి ప్రతిష్ఠ లినుమడించాయి. ఐశ్వర్యవంతు లనేకు లతనిచేత గొప్ప గొప్ప కట్టడాలు కట్టించి విరివిగా ధనధాన్యాదు లందించారు. అందువల్ల సుయ్యుని లేమి పూర్తిగ అంతరించింది. క్షేత్ర పాలిక కిక పనిపాటుల లక్కరలేకపోయింది. అంతేకాదు. కుమారునితో కలిసి ఇప్పు డామె ఒక భవంతిలో నివసిస్తున్నది.

సుయ్యుడటు పిమ్మట ఉప్పొంగు తున్న ఉత్సాహంతో వితస్తా నది కొక పెద్ద ఆనకట్ట కట్టించి, చిన్న చిన్న కాలవ లెన్నో తవ్వించాడు. కాశ్మీరంలో ప్రతి పల్లెకు నీటి పారుదలతోబాటు, పాడిపంటల సౌభాగ్యం కలిగించాడు. ఆ పైన మహాపద్మ సరోవరానికి, వితస్తా వాహినికి పెద్ద పెద్ద గట్లు వేయించి, దేశంలో మరి వరద ముంపు అన్న మాటే వినబడకుండా చేసి, అవంతివర్మ అభినందన లందుకున్నాడు. మహాపద్మ సరోవరంలో మీనములనుగాని, విహంగాలను గాని, ఎవ్వరు వేటాడరాదని, ఆ ప్రాణుల కెటువంటి హాని కలిగించరాదని ఒక గట్టి కట్టుడి ఏర్పాటు చేయించాడు.





అనతి కాలంలోనే కాశ్మీరంలో అంతటా ధాన్యలక్ష్మి పైడి గజ్జెల రవళి గలుగల్లుమని మారుమ్రోగింది. ప్రజానీకం సదా పాడి పంటలతో కలకలలాడింది. కరువు కాలంలో కాశ్మీరంలో పుట్టెడు ధాన్యం ధర వెయ్యి, యాభై బంగారు దీనారాల దాకా వెళ్లిపోయింది. విరివిగా పంటలు పండినప్పుడే ఆదేశంలో పుట్టెడు ధాన్యం ధర రెండు వందల సువర్ణ దీనారాల మీద నిలబడింది. కాని సుయ్యుని కాలంలో అది ముప్ఫయి ఆరు కాంచన దీనారాలయినందువల్ల, ప్రజానీకాని కెప్పుడు అన్న పానాదుల కేవిధ మయిన కొదవ కలగలేదు!

ఆ విధంగా తన దేశ ప్రజాసౌఖ్యం గమనించిన సుయ్యుని నేత్రాలానంద బాష్పాలతో తరళించాయి. అప్పటికి తన మనుగడ ధన్యమయినదని ఆనందించాడా ఔదార్యమూర్తి. అదే సమయంలో సుయ్యుడు తన పేరట అగ్రహార మొకటి దానం చేసి, అది విద్యల కన్నింటికి ఆట పట్టుగా విలసిల్లేటట్టు రూపొందించ వలెనని నిర్ణయించుకున్నాడు. అంతకు మునుపే వితస్త మీద వేరొక చోట ఒక పెద్ద ఆనకట్ట కట్టించి, దానికి తన తల్లి క్షేత్ర పాలిక పేరు పెట్టవలెనని సంకల్పించుకున్నాడు. దానిని నిర్మాణం పూర్తికాగానే ఒక నాడు అదే మాట ఆమెతో అన్నాడు.

* * *

కాని క్షేత్ర పాలిక ఆ మాట బొత్తిగా పట్టించుకోలేదు. వినీ విన నట్టు మాట్లాడ కూరుకున్నది. అంతటి శుభవార్త వినిపించినా తన తల్లి మౌనాని కేమి కారణమో సుయ్యునికి బోధపడ లేదు. తిరిగి ఇంకొకసారి అదే మాట రెట్టించాడు. దానిమీద క్షేత్రపాలిక కన్నీరొత్తుకుని ఉసూరు మని నిట్టూర్చింది. దాని కేమి కారణమని సుయ్యుడు తరిచి, తరిచి అడిగిన మీదట, ఆమె అతని పుట్టు పూర్వోత్తరాల సంగతి మొదలు పెట్టింది.

చాలా కాలానికి పూర్వం ఒక నాటి ఉదయం సుయ్యా అన్న చండాల మహిళ శ్రీనగర రాజ వీధిలో కసవూడుస్తున్నది. ఆ సమయంలో పక్కనే ఉన్న పనస చెట్టు కింద ఆమె కొక కుండ కనిపించింది. తెల్లని వస్త్రంతో పదిలంగా కప్పిన దాని మూత వైపు చూడగానే ఆమె కెంతో ఆశ్చర్యం కలిగింది. నెమ్మదిగా ఆ మూత తొలగించింది. దానిలో ముద్దులు మూట కట్టుతున్న శిశు ఒకడు అమాయకంగా వేలు కుడుచు కుంటూ నిద్రిస్తున్నాడు.

ఆ పసి పాప వైపు చూడగానే సుయ్యా హృదయం పాల ధారలతో పరవళ్లు తొక్కింది. 'అయ్యో, ఇంతటి రతనాల రాశిని ఆ కన్న తల్లి ఎలాగ విడిచి పెట్ట గలిగిందో!' అనుకున్నది. అయినా ఆ పసివాణ్ణి స్పృశించడానికే ఆమె ఎంతో సంకోచించింది. వెంటనే బయలు దేరిపోయి, కుండతోపాటు ఆ పసివాణ్ణి క్షేత్ర పాలిక కందించింది. ఆ చిన్నారి పోషణ సంరక్షణల భారం అంతా తానే వహించ గలనని మాట ఇచ్చింది. ఆ పసి కందుకే విధమయిన కొదవ కలగ కుండా పెంచవలసిందని అర్థించింది. ఎంతో అక్కర కలిగినప్పుడు గాని ఆ సంగతి ఆ పసి వానికి తెలియనీయవద్దని హెచ్చరించింది. అప్పటినించి ఆ శిశువు క్షేత్ర పాలిక వద్దనే పెరిగి పెద్దవాడయినాడు. చిన్ననాడే ఆమె అతనికి సుయ్యుడని పేరు పెట్టింది. క్రమ క్రమంగా అతనికి ఆయా కట్టడాల నిర్మాణంలో మిక్కిలి ప్రావీణ్యం కలిగింది. అదే వృత్తాంతం క్షేత్రపాలిక సంగ్రహంగా వివరించి, ఆ ఆనకట్టకు సుయ్యా పేరు పెట్టవలసినదని వేడుకున్నది.

సుయ్యునికా విచిత్ర విషాద గాథ వినగానే కళ్లమ్మట నీళ్లతోబాటు, లోలో పల తలపోత లెన్నో చెలరేగాయి. ఎక్కడో దొరికిన పసివాణ్ణి పెంచుకుంటున్నానని ఇన్నాళ్ల నించి ఆమె చెబుతున్న మాట పూర్తిగా నిజం కాదన్న మాట! ఇంత కాలం నించి తన సంరక్షణ భారం వహించిన తల్లి ఆ సుయ్యే నన్నమాట! ఆమె ఇప్పుడెక్కడ ఉన్నది? బ్రతికే ఉన్నదా? లేక చనిపోయిందా? ఆమె వృత్తాంత మేమి? వెనువెంటనేపోయి, కృపామయి ఆ సుయ్యా నొక్క సారి కళ్లారా చూడాలని అతని కనిపించింది. ఆమె సంగతి ఇంకా వివరించి చెప్ప వలసిందని క్షేత్ర పాలిక నర్థించాడు. ఆమె కొంత సేపు తటపటాయించి, సుయ్యాను గురించి మరి చెప్పవలసినదేమి లేదని తిరిగి విషణ్ణ స్వరంతో వివరించింది.

"నాయనా, నీ కిప్పుడు నలభయ్యవ పడి ప్రవేశించిం దనుకుంటాను. ఇంత కాలం దాకా ఆ సుయ్యా ఎలాగ బ్రతికి ఉంటుంది చెప్పు? ... నీ ఎనిమిదో ఏట ఆమె చనిపోయింది... అయితే అప్పటి నించి నీ సంరక్షణకోసమని తాను ఆజీవితాంతము కూడబెట్టుకున్న వెయ్యి బంగారు దీనారాలు నా చేతికిచ్చింది..."

"అయ్యో, ఆమె మరి లేదా? ఆ వాత్సల్య మూర్తి నొక్క సారి కళ్లారా చూచుకునే భాగ్యం కూడా నాకు కలగ లేదు కదా?" డగ్గుత్తికతో మాట తడబడి ఉసూరుమని నిశ్వసించాడు సుయ్యుడు. అంతలోనే చల్లని పలుకులతో క్షేత్ర పాలిక అతని నోదార్చింది.

"కలగ కేమి? ... నిన్నొక్కమారు ఆమె దగ్గరకి తీసుకు వెళ్లాను... అంతే! తుది గడియలో నిన్నొక్కసారి చూడాలని సుయ్యా ఎంతయినా ఆరాట పడింది... ఒకమారు నిన్నొక వృద్ధురాలి ఇంటికి తీసుకువెళ్లాను, జ్ఞాపకం ఉందా? ఆమే సుయ్యా! తాను కూడబెట్టుకున్న సొమ్మంతా నా చేతికిచ్చి, నిన్ను కంటికి రెప్పలా కాపాడవలసిందని మరి మరీ చెప్పి, కన్ను మూసింది... మహా పుణ్యాత్మురాలామె! కనకనే వైకుంఠ ఏకాదశినాడు సునాయాసంగా ప్రాణం విడిచింది!"

గద్గదిక వల్ల క్షేత్రపాలిక మరి మాట్లాడలేక పోయింది.

"ఆమె కింక కొడుకులు, కూతుళ్ళు ఎవ్వరు లేరా?"

సుయ్యుడు మరింత ఆత్రతతో ప్రశ్నించాడు.

"ఎవ్వరు లేరు నాయనా?"

క్షేత్రపాలిక నోట ఇక మాట వెలువడ లేదు. ఆమె చెక్కిళ్లపై కన్నీరు ధార కట్టి ప్రవహించింది.

సుయ్యుని మనస్సులో తిరిగి మథన ప్రారంభ మయింది. కన్న తల్లి కన్న మిన్నగా సంరక్షించినా, పెద్దతనంలో సుయ్య కేవిధంగాను తోడు పడలేక పోయానని అతడెంతో నొచ్చుకున్నాడు. ఆపైన అతని మనస్సులో తన కన్న తల్లిని గురించిన ఆందోళన ప్రారంభ మయింది.

'ఎవ్వరామె? పసిపాపగా ఉన్నప్పుడే తన్నలాగ ఎందుకని విడిచి పెట్టేసింది? ఆమె పేరేమి? కులగోత్రాలేవి? ఆమె కూడా సుయ్యలాగ దిక్కుమొక్కులేని నిర్భాగ్యురాలా? కన్న కొడుకునే పోషించు కోలేని దుర్భర స్థితిలో తన్నలాగ విడిచి వేసి తన దారిని తాను పోయిందా? ... లేక ఒక వేళ తాను అక్రమ సాంగత్యం వల్ల జన్మించినందువల్ల అలాగ విడనాడి పోయిందా? ఏది ఏ మయినా ఆమె తన కన్న తల్లి కనక, జన్మ భాగ్యం ప్రసాదించింది కనక అన్నివిధాల గౌరవనీయురాలే! పరమ పూజ్యురాలే! ... ఇంతకి ఎందుకలాగ విడిచి వెళ్లిపోయింది? ... తన దీన పరిస్థితిని గురించి ఆమె ఇంకెవ్వరికి తెలియజెయ్యలేదా?'

ఆ విధంగా ఆలోచించిన పిదప అదే సంగతి సుయ్యుడు క్షేత్రపాలిక వైపు చూచి ప్రశ్నించాడు. ఆమె నెమ్మదిగా సమాధానం చెప్పింది.

# సూర్యం పశ్య రోదసీ వేధశాల

మానవుని లెక్క ప్రకారం విశ్వంలో అన్నిటికంటె సూర్యగోళం అతి ముఖ్యమైనది.

కనుక సూర్యుని గురించి మరింత లోతుగా అర్థం చేసుకోవాలి. సౌర ప్రసరణ గురించీ, తత్సంబంధమైన దృగ్గోచర విషయాలను గురించి బాగా అర్థం చేసుకోవాలి.

అమెరికన్ రోదసీ కార్యక్రమంలో ఇదొక ముఖ్య లక్ష్యం. సౌర సంబంధమైన పరిశీలనలను జరపటానికి ఇరవై పైచిలుకు ఉపగ్రహాలను అమెరికా ప్రయోగించింది. వాటిలో ఆర్బిటింగ్ సోలార్ అబ్జర్వేటరీ ( భూమి చుట్టూ ప్రదక్షిణలుచేస్తూ సౌర పరిశీలనలు జరిపే అంతరిక్ష వేధశాల ) ఒకటి. దీనిలో రకరకాల శాస్త్ర పరిశీలన సాధనాలను పెట్టి ప్రయోగించారు. ఇది ఒక రకమైన రోదసీ వేదిక వంటిది. దీనిలో ఉన్న సాధనాలు సూర్యగోళం ఫోటోలు తీసి, తదితర సమాచారం సేకరించి భూమికి పంపుతుంటాయి.

1969 ఆగస్టులో ప్రయోగించిన సౌర అంతరిక్ష వేధశాల వీటిలో కొత్త ప్రయోగం.

1962 నుంచి ఇటువంటివి ఆరు రోదసీ వేధశాలలను అమెరికా ప్రయోగించింది. ఇది ఏడు రకాల శాస్త్ర ప్రయోగాలు చేస్తుంది. అమెరికా, ఇటలీ, ఇంగ్లండు దేశాలలో విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ లేబరేటరీలలో జరిగిన కృషి ఫలితంగా ఇవి రూపొందాయి.

సూర్యునికి సంబంధించిన వివిధ లక్షణాలలో వచ్చే పరిణామాలను గురించి, సూర్యగోళంలో కలవళపడుతూ ఉండే ప్రాంతాలను గురించి ముఖ్యంగా ఈ పరిశీలనలు జరుపుతారు. సౌర బిందువులున్న ప్రాంతంలో ప్రళయాంతకంగా చెలరేగే జ్వాలలను గురించి కూడా పరిశీలనలు జరుగుతున్నాయి. ఈ ప్రేలుళ్ల నుంచి వెలువడే విస్తార సౌర ధార్మిక శక్తితో సౌర వ్యవస్థ నిండుతుంటుంది. ఈ శక్తి కణరూపంలోనూ, తరంగ రూపంలోనూ వెలువడుతుంటుంది. ఇటువంటి ధార్మిక శక్తి "తుఫానుల" వల్ల, భూమి తాలూకు ఊర్ధ్వ వాతావరణం కల్లోలితమై, రేడియో తరంగాల ప్రసారానికి అవరోధం ఏర్పడుతుంటుంది. కొన్ని సందర్భాలలో ఉత్తర జ్యోతులు వెలిగి, రేడియో ప్రసారాలు నిలిచిపోతాయి.

సౌర వాతావరణంలో వివిధ అంచలలో ఉండే ఉష్ణోగ్రత, రకరకాల రసాయనిక ధాతువులను గురించి కూడా ఖచ్చితమైన సమాచారం ఈ పరిశీలనవల్ల లభించగలదని శాస్త్రజ్ఞులు ఆశిస్తున్నారు.

ఈ కొత్త రోదసీ వేధశాల విశిష్టమైనది. దీనిలోని శాస్త్ర పరికరాలు సౌర ఉపరితలంమీద 1,600 ప్రదేశాలను చూడటానికి వీలుగా ఇది సంచరిస్తుంటుంది. ★

---

"తెలియజెయ్యకేమి? తన్నుగురించి, నిన్ను గురించి ఎవ్వరయినా వేరొక విధంగ అపోహపడగలరని ఆమె ఆలోచించిందేమో! చింకిపాత వంటి ఒక భూర్జపత్రం మీద తన్ను గురించి నిన్ను గురించి నాలుగు మాటలు వ్రాసి ఆ కుండలో ఒక మూల అతికించింది!"

"ఏమని వ్రాసింది?"

"ఆ సమయంలో దేశంలో దారుణ క్షామం తాండవిస్తున్నది! ఆకటిచిచ్చుతో మనుష్య లెక్కడివా రక్కడే మరణిస్తున్నారు! ఎటువైపు పోయినా ఆన్నార్తుల హాహాకారాలే! ఎక్కడ పట్టెడన్నమయినా దొరకక, ఆమె ప్రాణాలిక అర గడియో, గడియో అన్నట్టున్నాయట! నీవొక ఉత్తమ వంశంలో జన్మించావట! కన్న పసిపాపనే కాపాడుకోలేక, అర్థిస్తున్నానని, కరుణార్ద్ర హృదయు లెవ్వరయినా ఆదుకుని నిన్ను రక్షించ వలసిందని వ్రాసింది."

"అంతేనా? ఆ పత్రంలో తన పేరు, కుటుంబం మొదలయిన వివరాలేవీ వ్రాయలేదా?"

"లేదు నాయనా! ఆమె అప్పటికే బాగా నీరసించినట్టుంది. వ్రాసిన అక్షరాలయినా బాగా గజిబిజిగా అలుక్కుపోయినట్టున్నాయి. ఇంకా ఏమయినా వ్రాయాలని ఆలోచించిందేమో! చిట్టచివరి మాట సగంలోనే నిలిచిపోయింది."

"అయితే ఆ పత్ర మేమయింది? నీ దగ్గిర ఉన్నదా?"

"లేదు! అప్పటకే బాగా పాతబడిపోయిన భూర్జపత్ర మది! మరి కొన్ని నెలలలోనే శిథిలమయి, ముక్కలు ముక్కలుగా, పొడిపొడిగా మారిపోయింది!"

క్షేత్రపాలిక 'అయ్యో, సుయ్యుని ఆత్రత ఆవంతయినా తొలగించలేక పోయానే!' అన్న దిగులుతో సుదీర్ఘంగా నిట్టూర్చింది. ఆ పైన ఎన్నెన్ని విధాల ప్రయత్నించినా సుయ్యునికి తన కన్నతల్లిని గురించిన వివరాలేవి లభించలేదు.

• • •

తన జననిని గూర్చి ఆలోచించుకున్నప్పుడు అతని హృదయంలో ఎవ్వరో చెయ్యిపెట్టి కలచి వేస్తున్నట్టనిపించింది. ఆమె దుస్సహ పరిస్థితిలో మరణించిన విషయం తలుచుకున్నప్పుడు అతని ఆలోచన ఎడతెగని తీవ్ర విషాదం వ్యాపించింది.

దేశాని కీనాడు తాను మహోన్నప్రదాత అని లోకులందరు ఎలుగెత్తి కీర్తిస్తున్నారు! తా నెచ్చటికి పోయినా అడుగడుగునా అపూర్వ గౌరవాదరా లెదురుపడుతున్నాయి. కాశ్మీరాధిపతి అవంతివర్మ తన నీనాడు మహామాత్యుని కన్న ఘనంగా గౌరవిస్తున్నాడు. ధనాగారమే తన కైవసం చేసి, దేశంలో ఇంకా మిగిలిన చిన్న చిన్న నదుల కన్నింటికి ఆనకట్టలు కట్టించి, కాలువలు తవ్వించవలసిందని అర్థిస్తున్నాడు. ఈనాడు కాశ్మీరంలో ప్రజలందరు పాడిపంటలతో, పిల్లలతో, పాపలతో, కలకలలాడుతున్నారు! కాని తన కన్నతల్లి పట్టెడన్నమే కరువై ఆకటి చిచ్చుతో అల్లల్లాడిపోతూ మరణించింది! అటువంటి పరిస్థితిలోకూడా తన సంరక్షణకోసం శాయశక్తులా ప్రయత్నించింది! 'ఆహా! ఏమి ఆమె వాత్సల్యము! ఎంతటి విధి వైపరీత్యము!' అని ఎంతో కుమిలి పోయాడు సుయ్యుడు.

అపూర్వాదరంతో తన్నా విధంగా సంరక్షించిన ముగ్గురమ్మల వాత్సల్యమూ తలుచుకోగానే అతని నిండు హృదయం ద్రవించి, వేడి వేడి కన్నీరై ప్రవహించింది. కొత్తగా కట్టించిన ఆనకట్టకు తనపేరు పెట్టగలనని అన్నప్పుడు, పెంపుడు తల్లి క్షేత్రపాలిక తగుదునని ఆ మహనీయ గౌరవం అంతా తానే దక్కించుకోవాలని తహతహ పడలేదు! సుయ్య వృత్తాంతం అంతా వెల్లడించి, ఆమె పేరే దానికి పెట్టవలసినదని ప్రోత్సహించింది! అందువల్ల సుయ్యునికి పెంపుడు తల్లి ఎడల ఎంతయినా పూజ్యభావం కలిగింది. కన్నతల్లి పేరట, సుయ్యపేరట, క్షేత్రపాలిక పేరట ఎన్నెన్ని వారధులు కట్టించినా, కాలువలు తవ్వించినా తన కెన్నటికి ఆవంతయినా ఋణ విముక్తి కలగజాలదని అత డనుకున్నాడు. అంతేకాదు. ప్రాణాపాయ సమయంలో కూడా తన క్షేమం కోరిన ఆ కన్న తల్లి ఋణ విముక్తి కేవలము దుస్సాధ్యమే అని కూడా సుయ్యుని కనిపించింది.

క్షేత్రపాలిక ఎన్నెన్ని విధాల వద్దు వద్దంటున్నా లక్ష్యపెట్టక ఆత డటు పిమ్మట వితస్తా నది నుండి ఒక పెద్ద కాలవ తవ్వించి, దానికి "క్షేత్రపాలిక" అని పేరు పెట్టాడు. ఆపైన అదే నది దిగువ భాగంలో వేరొక చోట నిర్మించిన ఆనకట్టపై "సుయ్యా సేతువు" అన్న నామధేయం సువర్ణాక్షరాలతో లిఖింపజేయించాడు.

అదే తరుణంలో అతనికి తన కన్నతల్లి జ్ఞప్తికి వచ్చింది కాని ఆమె పేరయినా ఎవ్వరికీ తెలియదు! ఆ కారుణ్య స్వరూపిణి మరణించి అప్పుడే చాలా కాలమయింది! ఆ అమృత మూర్తి ఇప్పుడు ఎక్కడ ఉన్నది? ఆ ప్రశ్న లతని హృదయాంతరాళంలోనుండి మాటిమాటికి వెలువడ్డాయి. ఎంతసేపటికి ఆ ప్రశ్నల కెటువంటి సమాధానము సుయ్యునికి స్ఫురించలేదు.

కాని అదే క్షణంలో, పసిరి పచ్చికలతో పచ్చని పొలాలతో, ఆల మందలతో, పాడి పంటలతో కర్షకులతో, వారి పసిపాపలతో ఆ శిశుమూర్తుల కన్న తల్లులతో, వారి చిరునవ్వులతో కలకల లాడుతున్న కాశ్మీర భూమి సమక్షంలో సాక్షాత్కరించింది.

వెంటనే అతని ప్రశ్నల కన్నింటకి మెరుపు మెరసినట్టుగా, ఒక్కసారుగా సరి అయిన సమాధానం తళుక్కుమని వెలిగింది! జన్మదేశం పైడి నేలలో సుయ్యతోబాటు, తన జనయిత్రి లీనమయిపోయిందని, కనక ఆ కాశ్మీరధాత్రి ఇక తన ఏకైక మాతృదేవత అనితోచింది. అందువల్ల ఆ భూమిలో ప్రతి అణువు అత్యంత పవిత్రమయిన దని కూడా భావించుకున్నాడు సుయ్యుడు. ఆ నేలపై జన్మించిన ప్రతి ప్రాణి, ప్రతి లత, ప్రతి తరువు తన తోబుట్టువులని కూడా అతని కనిపించింది. ఆ భావనతో సుయ్యుని నేత్రాంతాల నుండి ఆనంద భాష్పాలవిరళ ధారలై ప్రవహించాయి.

ఎన్నెన్ని వేల మారులయినా అక్కడే జన్మించేటట్టు అనుగ్రహించవలసినదని, తన కెల్లవేళల చరణ సేవా భాగ్యం ప్రసాదించవలసిందని ఆ కాశ్మీర ధాత్రికి అంజలి ఘటించి ప్రార్థించి, సాష్టాంగ నమస్కృతి సమర్పించా డా మహనీయ పుణ్యమూర్తి సుయ్యుడు. ★